# ఏ ముక్తి

మధ్యాహ్నం ఎండ తీక్షణంగా ఉంది. ఆశ్రమంలో అంతా నిశ్శబ్దంగా ఉంది తోటలో ఉదయం నవ్విన పువ్వులు ఆ వేసవి ఎండకు సొమ్మసిల్లాయి. మామిడిచెట్టు నీడలో జ్ఞానచంద్రుడు పరధ్యానంగా ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. చెట్టుమీద కోయిల హృదయ విదారకంగా కూస్తోంది, ఏదో గాయపడినట్లు. అతను అది వినిపించుకో లేదు. ఆ క్షణాన అతనికి బయట ప్రకృతితో సంబంధంలేదు.

ఆరేళ్ళ వయస్సులో అతను ఇక్కడికి వచ్చాడు. గురువు ప్రేమానందుడు అతనిని తీసుకువచ్చి పెంచాడు. చిన్నప్పటినుంచి బాహ్యప్రపంచానికి దూరమై అతను ప్రశాంతంగా పెరగాలి. ఏమాలిన్యమూ లేక ఎప్పుడూ సదాచారాలతో మెలగాలి. వేదవేదాంతములు చక్కగా అభ్యసించాలి. ఈ ఆశ్రమ సంప్రదాయాలు, ఆచారాలు అన్నీ చక్కగా ఆకళింపు చేసుకుని తన తరువాత అతను దీనికి ఉత్తరాధికారి కావాలి. ఈ ఆశ్రమభారం వహించాలి. ఉపశమనాన్ని ఊరటను వెతుక్కుంటూ ఇక్కడకు వచ్చే వ్యక్తులకతను ఆశ్రయమివ్వాలి అండగానిలవాలి. అది ప్రేమానందుని ఆశయం. అందుకే చిన్నతనంలోనే జ్ఞానచంద్రుని

ప్రపంచానికి దూరంచేసి తీసుకువచ్చి తనదగ్గర ఉంచుకున్నాడు.

ఆశ్రమం మూడుకొండలమధ్య ఉంది. ఏవేపు చూచినా చెట్లు పచ్చగా కమ్ముకుని కనిపిస్తాయి. దూరంగా కొండలు నున్నగా ఎత్తుగా కోటగోడల్లా కనిపిస్తాయి. అప్పుడప్పుడు కలకలమనే పక్షుల రొదతప్ప అక్కడ ఇంకే శబ్దము వినిపించదు. ఆశ్రమం కొండరాళ్ళతో చక్కగా విశాలంగా కట్టబడి ఉంది. ఆశ్రమం చుట్టూ పెద్దతోట అన్నివైపుల వ్యాపించి ఉంది; అరటిచెట్లు, మామిడిచెట్లు, పొగడచెట్లు వరుసవరుసలుగా ఉంటాయి.

ఆశ్రమానికి వచ్చినది మొదలు జ్ఞానచంద్రునికి మనశ్శాంతి లేదు. ప్రపంచానికి దూరంగా ఏదో బంధనంలో పడ్డట్లనిపించింది. దూరాన కొండలు అతని మనస్సుకు చెరసాల గోడల్లా తోచేవి. అయినా అతను ఈ అశాంతి ఎప్పుడూ పైకి చూపలేదు. అతనికి ప్రేమానందునిమీద అపరిమితమైన గౌరవము, ఆదరము. ప్రేమానందునిలో కరుణ, ప్రేమ, వాత్సల్యము మూర్తీభవించి ఉంటాయి అతని సాన్నిధ్యంలో అందరూ అన్నీ మరచిపోతారు.

జ్ఞానచంద్రుడు తన అసంతృప్తి బాహ్యప్రపంచాన్ని చూడాలన్న కుతూహలమూ లోలోపలే అణచుకుని గురువు నేర్పిన విద్యలన్నీ నేర్చుకున్నాడు. ఆశ్రమ అలవాట్లన్నీ తెలుసుకున్నాడు. ప్రేమానందుడు యథాలాపంగా ఒకనాడు చెప్పాడు: 'ఇంకమీదట నీవే ఈ ఆశ్రమ భారం వహిం

చాలి, నాయనా! నాకు శక్తి క్షీణిస్తోంది" అని. ఆ మాట విన్నప్పటినుంచి జ్ఞానచంద్రుని మనస్సులో సంక్షోభం ఎక్కువైంది. ఇక తాను ఈ వాతావరణంలోనే శాశ్వతంగా బందీ అయిపోతున్నానని బాధపడ్డాడు. ఎల్లాగైనా ఇక్కడ నుంచి విముక్తిపొంది దూరంగా బయటి ప్రపంచంలోకి పారిపోవాలని తపనపడ్డాడు. పదేళ్ళగా తనను ప్రేమతో పెంచి, తనమీదనే ఆశలుపెట్టుకున్న గురువు హృదయంలో ఇది ఎట్లాంటి నిరాశను, సంక్షోభాన్ని, కలిగిస్తుందోనని భీతి చెందాడు. తనను పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు నేర్పి ఆశ్రమభారం తాను వహిస్తాడని ప్రేమానందుడు ఆశలు పెంచుకున్నాడు. ఆయన వృద్ధుడవుతున్న సమయంలో వదలి వెళ్ళిపోవటం ఏదో కృతఘ్నతలా తోచింది. అతని మనస్సుకు ఊరట లేదు. ఆలోచనలతో, ప్రొద్దు గడుస్తున్నదే తెలియలేదు. పరధ్యానంగా కూర్చున్నాడు.

అయినా మనస్సు మార్చుకునే శక్తి అతనికి లేదు. అతనిలో ప్రతి అణువు స్వేచ్ఛకోసం పరితపించింది మనస్సు ఏదో ఊపిరాడనట్లు ఉక్కిరి బిక్కిరయింది. ఈ ఆశ్రమానికి దూరంగా పోతేనేగాని తనకు స్వేచ్ఛలేదు, విముక్తిలేదు అనిపించింది. ఏమైనా వెళ్ళక తప్పదనుకున్నాడు. అతని మనసుకు ఆ క్షణాన భగవంతుని సృష్టికి దూరం కావటం భగవంతునికే దూరంకావటం కాదా అనిపించింది. అన్నింటికీ దూరమై అన్ని ఆశలు వదలిన మమతలులేని జీవితమే

ప్రశాంతి అని గురువు చెప్పాడు ఆ క్షణాన ఆ మాట రుచించలేదు: తాను వెళ్లక తప్పదనుకున్నాడు.

పొద్దు వాలింది. అతను లేచి ఆశ్రమంలోకి వెళ్లాడు. వెనకవేపు వసారాలో ప్రేమానందుడు కూర్చుని మామూలుగా పాఠం చెబుతున్నాడు. భగవద్గీత చదువుతున్నాడు. జ్ఞానివెళ్ళి ఒక స్తంభంచాటున ఒదిగి కూర్చున్నాడు. ప్రేమానందుడు అది గమనించినా ఏమీ అనలేదు. మామూలుగా సాంఖ్యయోగంలో ఒకశ్లోకం చదివాడు. "దుఃఖేష్వనుద్విగ్న మనాస్సుఖేషు—" అని ఒక్కొక్క పదము సూటిగా హృదయానికి హత్తుకునేటట్లు స్ఫుటంగా ఉచ్ఛరిస్తూ శ్లోకం చదవటం పూర్తిచేశాడు తరువాత అర్థం వ్యాఖ్యానించి చెప్పాడు. ఆ మాటలు వింటూఉంటే జ్ఞానికి క్షణం మనస్సు పరవశమైంది. గురువు కంఠంలో గీతావాక్యాలు వినేటప్పుడు అతను ఒక్కక్షణం పరవశమై అన్నీ మరచిపోతాడు. ఆయనకు తాను ఇప్పుడు దూరమైపోతున్నానుకదా అని ఒకసారి కన్నులలో నీరు నిండింది.

ప్రేమానందుడు పాఠం ముగించాడు. జ్ఞానిని ముందుకు రమ్మని పిలిచాడు. "ప్రొద్దుటినించి కనబడలేదే నాయనా! ఎక్కడున్నావు?" అన్నాడు ఆప్యాయంగా జ్ఞాని మాట్లాడలేదు. ప్రేమానందుడు మళ్లీ అన్నాడు. "ఇంక పాఠాలు నీవే చెప్పాలి. ఎప్పుడు ప్రారంభిస్తావు?" అని అనుకోకుండా హటాత్తుగా జ్ఞాని అన్నాడు:

"నేను రేపు వెళ్ళిపోతున్నాను" అని.

ప్రేమానందుడు ఆశ్చర్యంగా అతనివేపు చూశాడు. జ్ఞాని మళ్ళీ అన్నాడు.

"ఈ ఆశ్రమభారాన్ని నేనిప్పుడు స్వీకరించలేను. నేను కొన్నాళ్లు ప్రపంచం చూసి వస్తాను," అని ప్రేమానందుడు మనసులోని వ్యథ కనపడనీయలేదు. నవ్వుతో అన్నాడు: 'అల్లాగే నాయనా! నీ ఇష్టప్రకారమే చెయ్యి" అని.

జ్ఞానచంద్రుని మనసు తేలికపడింది. ఇది ఇంత సులువుగా తేలిపోతుందనుకోలేదు. గురువుకు నమస్కరించి వెళ్ళిపోయాడు. ప్రేమానందునికి క్షణం అన్నీ శూన్యంగా కనిపించాయి. ఆయన నిమీలితనేత్రుడైనాడు. అలాగే భగవద్ధ్యానం చేశాడు. వసారా అంచుకు వచ్చి ఆకాశంకేసి చూశాడు. అతని మనసులో మెరపు మెరిసింది. ఆకాశాన కమ్ముకున్న మేఘాలు అవే మాయమవుతాయి. అవి ఎక్కువ కాలం నిలువలేవు. జ్ఞానచంద్రుని మనస్సును కమ్ముకున్న విషాదరేఖలు సందేహాలు అవే సమసిపోతాయి; అది తప్పదు —అనుకున్నాడు.

పదేళ్ళక్రిందట అతనికి తోచింది, తన తరువాత ఆశ్రమాన్నెవరు చూస్తారు అని. సన్యాసియైన తను ఎవరినో చేరదీసి ఈ ఆశ్రమభారాన్ని వహించేటట్లు చేయాలనుకున్నాడు. అన్నివిధాల అర్హమైన బాలుణ్ణే వెతకి తెచ్చాడు. జ్ఞానచంద్రునికి చదువులో పనిపాటలలో చురుకుదనం,

ఆసక్తి పుట్టుకతో వచ్చాయి అతనికి తాను విరక్తిభావాలు వెన్నతో రంగరించి పెట్టాడు. అందరు పిల్లలాగా ఆటపాటలతో కాక, జ్ఞానచంద్రుడు బరువుబాధ్యతలతో పెరిగాడు. అది అతనికి సహజమే అయింది. అతని మనస్సులో అసంతృప్తి అశాంతి ఉన్నవని తనకు ఇంతవరకు తెలియనేలేదు. బాహ్య ప్రపంచాన్నుంచి దూరం చెయ్యటంచేత అతని మనస్సులో కుతూహలం రేగి ఉంటుంది. అదే అశాంతిగా పరిణమించింది. సుఖదుఃఖాలు చవి చూచిన తరువాత విరక్తి సహజమే: చిన్నవయస్సులో అసంతృప్తి, కుతూహలము సహజం, అంతేకదా, అనుకున్నాడు.

ఉదయం లేవగానే ప్రేమానందుడు పూజా మందిరానికి వెళ్లాడు. శ్రీకృష్ణుని పాలరాతివిగ్రహం చక్కగా అలంకరింపబడి ఉంది. మందిరం అప్పుడే తెచ్చి ఉంచిన కొత్త పూల పరిమళంతో గుబాళిస్తున్నది. ఒక్కక్షణం ప్రేమానందుడు మైమరచినట్లు నిలిచాడు. మనసు ధ్యాననిమగ్నమైంది. పూజకు వేళ అయింది. హారతి పట్టటానికి జ్ఞానచంద్రుడు రాలేదు. సంయమి వచ్చి మెల్లగా చెప్పాడు: "జ్ఞానచంద్రుడు లేడు. ఎక్కడ వెతికినా కనిపించటంలేదు" అని. ప్రేమానందుడు జాలిగా నిట్టూర్పు విడచాడు. ఏమీ అనలేదు. హారతిపళ్ళెం తానే పట్టుకున్నాడు. తనచేతులలో బలం ఉన్నన్నాళ్ళు పూజ సాగుతుంది. ఆశ్రమం నడుస్తుంది. అంతే; తరువాత దేవుని దయ!—అనుకున్నాడు.

కాస్సేపటికి సంయమి, మేధావి, గుణి వచ్చి చుట్టూ

కున్నారు. "చూశారా! పసిపిల్లవాడుగా తెచ్చి పెంచి పెద్ద జేసి, భారం వహిస్తాడని ఆశపడితే జ్ఞాని ఎలా మౌనంగా దూరమయ్యాడో!" అన్నాడు, మేధావి. "పాము పడగ ఎత్తినట్లు మనసులో అశాంతి మొలకెత్తితే మనిషిని నిలువనీయదు. ఆ చిత్త విభ్రమమేదో తొలగిపొయ్యేవరకు నిలుకడ కుదరదు. వృథానిందలెందుకు?" అన్నాడు సంయమి. "అవును. అన్న వెళతానన్నాడు, నాన్నగారు వెళ్లమన్నారు. వారికి తెలియదా!" అన్నాడు గుణి.

ప్రేమానందుడు సంతోషించాడు. ఆ ప్రసంగం అంతటితో ఆగిపోయింది. మామూలు పనులు క్రమం తప్పకుండా జరుగుతూనే ఉన్నాయి ఆశ్రమం కొండలమధ్య ఉంది. ఎక్కువమంది ప్రయాసపడి అక్కడికి రాలేరు. బాహ్య ప్రపంచంతో సంబంధం తెంపుకున్నవారు మాత్రమే అక్కడ ఉండాలని కోరుకుంటారు. వారికాకొండలలో నుంచి ఊరట, ఏదో సందేశము వినపడుతూ ఉంటుంది. అది గాలికి కదలే ఆకులలో, ఆకాశంనుంచి జారిపడే వర్షపు బిందువులలో, కొండల పైభాగంలో సంజవేళ కలకల మనే పక్షుల సమూహంలో కలసిపోయి మనసును కమ్ముకుంటుంది.

నెలలు గడిచాయి. సంవత్సరాలు దాటాయి. ప్రేమానందుడు మరీ పెద్దవాడైనాడు. ఆసనంమీదనుంచి లేవటమే బాధ. పూజవేళకు మందిరానికి గుణి, మేధావి పట్టుకుంటె మెల్లగా వెళతాడు, పూజ కాగానే మందిరం వెనకవేపు మండపంలో తోటను చూస్తూ ధ్యానం చేస్తూ

కూర్చుంటాడు చాలా సేపు. మళ్ళా ఆశ్రమానికి వెళతాడు. సాయంత్రం, ఆరోగ్యం ఎలా ఉన్నా, విధిగా భగవద్గీత చదివి చెపుతాడు, చుట్టూ చేరినవాళ్ళకు.

ఆశ్రమానికి అతిథులు అప్పుడప్పుడు వస్తున్నారు, పోతున్నారు, ఎవరి చిత్తం వచ్చినన్నాళ్ళు వాళ్ళు ఉంటారు స్వేచ్ఛగా! మళ్ళా బయటనుంచి పిలుపువస్తే ఎవరితోవన వాళ్ళు వెళతారు. ఆశ్రమ బాధ్యతలన్నీ సంయమి చూచుకుంటున్నాడు. ఆ వేళ వెళ్ళిన జ్ఞానచంద్రుడు మళ్లీ రానే లేదు. ఆశ్రమంలో ఎవరూ అతని ప్రసక్తే తేవటంలేదు. అతను అదివరకక్కడ తమతో కలిసి ఉన్నాడనే అందరూ మరచిపోయినట్లున్నారు.

ఆ వేళ మధ్యాహ్నం ప్రేమానందుడు నిద్రపోతున్నాడు. ఆశ్రమం అతి నిశ్చలంగా ఉంది, జ్ఞాని వెళ్లిన రోజులాగే! ఆ వేళ ఎండ తీక్షణంగా కాస్తోంది. మేధావి శంకరాచార్యుల వ్యాఖ్యానాలు మననం చేస్తున్నాడు దక్షిణంవైపు తోటలో మామిడిచెట్టుకింద కూర్చుని. అతని మనస్సంతా అందులోనే లగ్నమై ఉంది. ప్రక్కన చెట్లనీడలో చిన్నచిన్న పొదలమీద ఆరవేసిన శాటీలు తీసి వరుసగా మడతలు పెడుతున్నాడు గుణి. సంయమి అక్కడలేడు: కొండలోయలోకి వెళ్ళాడు. ఉదయంనుంచి కపిలగోవు కనిపించటంలేదు. ఉండి ఉండి అలా మాయమవటం దానికి అలవాటు. ఆ ఎండవేళ దాన్ని వెతుక్కుంటూ సంయమి లోయలోకి వెళ్ళాడు. లోయలోకి దిగ

గానే దట్టంగా ఉన్న చెట్లనీడలో జ్ఞాని కనిపించాడు. అతను చాలా అలసిపోయినట్లు ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నాడు. ప్రక్కనే కపిలగోవూ వుంది. ప్రశాంతంగా పడుకొని నెమరువేస్తోంది. సంయమికి సంతోషం కలిగింది. గోవు వీపు నిమురుతూ పక్కనే కూర్చున్నాడు. తదేకదీక్షగా జ్ఞానిముఖం చూచాడు. వెళ్ళిపోయేటప్పుడు జ్ఞాని పసివాడు. ఇప్పుడు వయస్సు వచ్చినట్లున్నాడు ముఖంలో అమాయకత్వము, అశాంతి, తొలగిపోయి తుఫానులో చెదరి ప్రశాంతంగా ఒడ్డుకుచేరిన నావలా ఉన్నాడు.

సంయమి నిశ్చింతగా ప్రక్కనే పడుకున్నాడు. కాస్సేపటికి జ్ఞాని లేచాడు. సంయమిని చూచి ఉలిక్కిపడ్డాడు. సంయమి మెల్లగా నవ్వాడు. "పద, ఆశ్రమానికి పోదాం" అన్నాడు. జ్ఞాని ముఖం చిన్నబుచ్చుకున్నాడు.

"నాన్నగారిముఖం ఎలా చూడను? ఎలా క్షమాపణ కోరను?" అన్నాడు, ఆవేదనతో. సంయమి మళ్ళానవ్వాడు. "అది ఏదో నేను చూస్తానులే; పద, పోదాం" అన్నాడు.

కపిలగోవును తోలుకుంటూ సంయమి ముందు నడిచాడు. జ్ఞాని వెనకాలే వెళ్ళాడు. అప్పటికి సాయంత్రమైంది. ప్రేమానందుడు వెనకవేపు వసారాలో కూర్చున్నాడు మామూలుగా గీతాపాఠం చదివి చెప్పుతూ. ఆశ్రమం గుమ్మందగ్గర జ్ఞాని ఆగిపోయ్యాడు. సంయమి అన్నాడు: "నేను లోపలకు వెళ్లి నాన్నగారితో చెప్పి వస్తాను" అని, ప్రేమానందుని దగ్గరకు వెళ్లి చెప్పాడు: "జ్ఞాని వచ్చాడు,"

అని. ఆయనముఖం సంతోషంతో వికసించింది. వెంటనే ఏమీ జరగనట్లుగా అన్నాడు. "కాళ్ళూ ముఖం కడుక్కొని పాఠానికి రమ్మను" అని జ్ఞాని మౌనంగా ఎదట కూర్చు న్నాడు. ప్రేమానందుడు మళ్ళా అదే శ్లోకం చదువుతున్నాడు. "దుఃఖేష్వనుద్విగ్నమనాస్సుఖేషు విగతస్పృహః–" జ్ఞానిని చూచి అన్నాడు: "పోయినసారి ఈ శ్లోకమే చెబుతున్నాను. మళ్ళా అది ఒకసారి చదివి తరువాత శ్లోకం చెబుతాను" అని. ఈసారి శ్లోకం పూర్తిగా చదివాడు.

"దుఃఖేష్వనుద్విగ్న మనాస్సుఖేషు  
విగతస్పృహః, వీతరాగభయ  
క్రోధఃస్థితధీర్ముని రుచ్యతే."

రాగభయ క్రోధములు లేనివాడే ముని, స్థితప్రజ్ఞుడు, ముక్తుడు–అని వ్యాఖ్యానించాడు. జ్ఞాని మౌనంగా విన్నాడు. అప్పటికి మధ్యలో పదేళ్ళు గడిచినట్లే తెలియలేదు. తాను నిన్న పాఠం విన్నాడు; మళ్లా ఇవ్వాళ వింటున్నాడు అని పించింది. కాస్సేపటికి ప్రేమానందుడు పాఠం ముగించాడు. జ్ఞానినిచూచి అన్నాడు "నాయనా! వెళ్లి సాయంత్రం పూజకు అన్నీ ఏర్పాటు చెయ్యి" అని. జ్ఞాని మనస్సు కృతజ్ఞతతో పశ్చాత్తాపంతో కరిగిపోయింది. కళ్ళ నీళ్లు తుడుచుకుంటూ వెళ్లిపోయాడు.

ఆ రాత్రి ఆరుబయట సంయమి జ్ఞాని ఒకచోటే పడుకున్నారు ఇద్దరికీ నిద్ర రాలేదు. చాలాసేపటికి సంయమి అన్నాడు. "మళ్లా ఎందుకు వచ్చావు?" అని. కొద్దిక్షణాల

తరువాత జ్ఞాని చెప్పాడు. "అక్కడ నిజంగా స్వేచ్ఛ లేదు. ఇక్కడే ఉంది అక్కడ శాంతి లేదు. ఇక్కడ ఉంది. అక్కడ సౌందర్యంలేదు. ఇక్కడ వుంది ఇది నిర్మలమైన నీరు;- అంతే!" అన్నాడు.

సంయమి నవ్వుతూ అన్నాడు. "స్వేచ్ఛ కావాలన్న నీ తపన ఇప్పుడు తీరిందా?" అని. జ్ఞాని సిగ్గుపడ్డాడు. "స్వేచ్ఛగా ఉన్నప్పుడు అది తెలియలేదు. అయాచితంగా వచ్చినదానికి విలువ తెలియదు. ఇక్కడనుంచి వెళ్ళి, నన్ను కన్నవారింటికి వెళ్ళాను ఆరేళ్ల వయస్సులో ఆశ్రమంలో వదిలి నిశ్చింతగా వెళ్ళిపోయిన అమ్మా నాన్నను వెతుక్కుంటూ వెళ్ళాను. ఇన్నాళ్ళు వాళ్ళదగ్గరే ఉన్నాను. వాళ్ళు నన్ను ప్రేమగా చూచారు. కాని, ఆ అనురాగమే బంధనము. అది ఊపిరాడనీయదు; స్వేచ్ఛ నివ్వదూ. ఎప్పుడు ఎడతెరిపిలేని ఇరుకుబాటల్లో ఇరుక్కుని ఊపిరాడక బయటపడలేక పరితపిస్తాము. అమ్మ సుఖంగా లేకపోతే నాన్న ప్రశాంతంగా ఉండలేడు తమ్ముడికో, చెల్లెలికో అనారోగ్యమైతే అమ్మ సంతోషంగా ఉండలేదు. అందరికోసం తన సుఖాన్ని, ప్రశాంతిని వదులుకొంటుంది. మమకారం ఒకరినొకరిని ముడిపెడుతుంది. ఒకరినొకరు వదలి బ్రతుకలేరు. చిక్కుపడిన లతలాగా పెనవేసుకుపోతారు. ఇక స్వేచ్ఛ ఏమున్నది? అది ఎడతెగని బంధం, విముక్తి లేదు.

"ఈ ఆశ్రమంలో మనకే బంధనాలు లేవు. ఏ మమకార వికారాలు, ఆశలు నిరాశలు లేవు. ఈ జడజీవనంలోనే

నిజంగా ప్రశాంతి, స్వేచ్ఛ!" అన్నాడు. సంయమి సంతోషించాడు. ఇక జ్ఞాని ఎక్కడకూ పోడు. అతని మనస్సు ఇంకెప్పుడూ మారదు-అని తృప్తిచెందాడు.

ఇద్దరికీ కునుకుపట్టింది. తూర్పున వేగుచుక్క ఉదయించింది. ఇద్దరూ లేచి వెళ్లిపోయారు. జ్ఞాని మామూలుగా పూజామందిరాన్ని అలంకరించాడు. మామూలుగా దేవునికి హారతిపట్టాడు. మధ్యకాలంలో ఏమీ జరగనట్లే ఆశ్రమభారం వహించాడు.

పూజ అయ్యాక తోటవేపు మండపంలో ప్రేమానందుడు కూర్చున్నాడు. జ్ఞాని, సంయమి, మేధావి, గుణి అంతా అక్కడే ఉన్నారు.

"జ్ఞానికి శాస్త్రప్రకారం ప్రాయశ్చిత్తం జరిపించనక్కరలేదా?" అన్నాడు మేధావి. "అవును: నిజమే. అది అవసరమేమో!" అన్నాడు గుణి. "ప్రాయశ్చిత్తం అంతా పూర్తిఅయ్యే జ్ఞాని ఇక్కడకువచ్చాడు." అన్నాడు సంయమి గంభీరంగా. ప్రేమానందుడు వాత్సల్యంతో నవ్వాడు. జ్ఞాని ఏవికారమూ లేకుండా, నిశ్చలంగా ఊరుకున్నాడు.

తోటవేపు గుంపుగా వచ్చి వాలిన పాలపిట్టలు ఒక్కసారి సంతోషంగా స్వేచ్ఛగా కలకలమంటూ ఎగిరిపోయాయి. వాటి కుదుపుకు తోటలో తీగలన్నీ ఉత్సాహంతో ఊగిసలాడాయి. మళ్లా అచలంగా ఆగిపోయాయి. కొండశిఖరాన్నుంచి జారివచ్చి నిరవధికమైన ప్రశాంతి, నిశ్శబ్దం, తోటంతా, లోయ అంతా, అలమకున్నాయి.